# ప్రాంతీయ సమగ్ర, ఆర్థిక భాగస్వామ్య వాణిజ్య ఒప్పందం

## దేశ ప్రయోజనాలు బుట్టదాఖలు

**భారతదేశం,** మరో 15 ఇతర దేశాలు వియత్నాంలో జరిగిన ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య(ఆర్‌సిఇపి) సదస్సులో మలివిడత చర్చల్లో పాల్గొన్నాయి. అందిన వార్తలనుబట్టి పెట్టుబడుల నిబంధనలకు సంబంధించి భారతదేశం అనేక రాయితీలకు ఒప్పుకున్నది. పెట్టుబడులు పెట్టే విదేశీ కంపెనీలు దేశీయ భాగస్వామ్య కంపెనీలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించటాన్ని తప్పనిసరి చేయటంపైనా, దేశీయ కంపెనీలు తమ విదేశీ భాగస్వాములకు చెల్లించే రాయల్టీలపైనా వున్న నిబంధనలను ఎత్తివేయటం వీటిలో ముఖ్యమైనవి.

ది హిందూ పత్రిక ప్రకారం "ఆర్‌సిఇపిలోని పెట్టుబడుల విభాగపు ఒప్పందం ఆమోదించ బడింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేసుకోవటానికి, రాయల్టీల చెల్లింపులపై వున్న పరిమితులను ఎత్తివేయటానికి ఇండియా అంగీకరించింది". పాలు, పాల ఉత్పత్తులపై దిగుమతుల సుంకాన్ని తగ్గించటానికి కూడా ఇండియా ఒప్పుకుంది.

ఇప్పటిదాకా భారత ప్రభుత్వం భారతదేశ ప్రయోజనాలకు నష్టం కల్గించే విధానాలైన సాంకేతికత బదిలీ, రాయల్టీలపై పరిమితులకు సంబంధించి కఠినమైన వైఖరిని అవలంబిస్తున్నట్లు చెప్పుకున్నది. ఏ అంతర్జాతీయ ఒప్పందమైనా భారత పార్లమెంటుయొక్క ఆమోదాన్ని పొంద వలసిన పనే లేదు. ప్రభుత్వం తన చిత్తం వచ్చినట్లు సంతకం పెట్టేస్తే చాలు. తాము చేయబోయే పనులకు అనుకూల వాతావరణాన్ని ఏర్పరచుకోవటానికి జాగ్రత్తగా పావులు కదపటంలో భాగమే మీడియాకు లీకు చేసే వార్తలు.

ఆర్‌సిఇపి ఒప్పందంపై సంతకం పెట్టినట్లైతే కోట్లాది మంది భారత రైతాంగపు భూములు గుంజుకోబడటమే కాకుండా, వారి జీవనం అస్తవ్యస్తం కానున్నది.

వ్యవసాయంలో భూమి అత్యంత కీలక మైనది. విదేశీ ఇన్వెస్టర్లు, వ్యవసాయ వాణిజ్య సంస్థలు భూములను ఆక్రమించుకోవటంవల్ల చిన్నరైతుల, ఆదివాసుల జీవితాలు, జీవనోపాధి ప్రమాదంలో పడనున్నాయి. అదే సమయంలో భూకేంద్రీకరణ కారణంగా ఆహారపదార్థాల ధరల్లో ఎగుడుదిగుళ్ళు, జూదతరహా వ్యాపారం దిగుమతులపై అధికంగా ఆధారపడటంవంటి వాటితో దేశాల పరిస్థితులు మరింత దిగజారతాయి.

ఆర్.సి.ఇ.పి. సభ్యదేశాలలో గత దశాబ్దంలో 96 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమి గ్రామీణ ప్రాంతాలనుండి విదేశీ కార్పొరేట్లకు అప్పగించ బడింది. ఆస్ట్రేలియా, కంబోడియా, ఇండోనేషియా, లావోస్‌లలో ఈ భూబదిలీలు అత్యధికంగా జరిగాయి. సింగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న విల్మర్ అండ్ ఓలం కంపెనీ దక్షిణ కొరియా గుత్తకంపెనీ దేవూ, చైనా వ్యవసాయ కంపెనీ అయిన బీదాహాంగ్ గ్రూపులు లక్షలాది హెక్టార్ల భూములను ఆర్‌సిఇపి ప్రాంతాలలో చేజిక్కించు కున్నాయి.

2012లో ఆర్‌సిఇపి చర్చలు ప్రారంభమైన నాటినుండి ఆన్‌లైన్ వాణిజ్యం, సమాచార సాంకేతికత ప్రముఖంగా ముందుకు వచ్చి ఆర్‌సిఇపి సభ్య దేశాలలో వ్యవసాయ భూములపై పెట్టుబడులు పెట్టటానికి కొత్త కార్పొరేట్లను ఆకర్షించాయి. చైనా ఆన్‌లైన్ వాణిజ్య దిగ్గజం 'ఆలీబాబా' న్యూజిలాండ్‌లో మొత్తం 12000 హెక్టార్ల భూమిలో 29 డైరీ ఫార్మ్‌లను స్వంతం చేసుకున్నట్లు తెలుస్తోంది.

ఆర్‌సిఇపి వ్యాపార ఒప్పందానికి భూముల కబ్జా విధానాన్ని అధికంచేసే శక్తి వుంది. ఇవి సూచించే నిబంధనలన్నీ రైతాంగం నుండి బడా వ్యవసాయ వాణిజ్యవేత్తలకు భూములను బదిలీ చేయటానికి అనువుగా వుంటాయి. పెట్టుబడుల విభాగంలోను, సర్వీసుల విభాగంలోను ఈ నిబంధనలు వున్నాయి. ఈ రెండూ వ్యవసాయం లోను, సర్వీసులలోనూ విదేశీ పెట్టుబడులు పెట్టటానికి వున్న అడ్డంకులను తొలగించడంలో ప్రభుత్వాలకు సహకరిస్తాయి.

ఆర్‌సిఇపిలో ఒక ప్రధానమైన నిబంధన ఏమంటే 'జాతీయంగా పరిగణించటం'. ఆర్‌సిఇపిలోని ప్రతి దేశము ఇతర సభ్యదేశాల బహుళజాతి కంపెనీలను స్వదేశీ కంపెనీలుగానే భావించాలి. అంటే ఇండియా, ఇండోనేషియా, ఫిలిప్పైన్ దీవులు, థాయ్‌లాండ్ వంటివి విదేశీయులు స్వంతం చేసుకోవటానికి వీలు లేకుండా భూములపై రైతాంగానికే హక్కులు దఖలు పరిచిన విధానాలు ఇంకెంతో కాలం కొనసాగించలేవు; సంతకాలు చేసేటప్పుడు ప్రత్యేక మినహాయింపులేమైనా కోరితే తప్ప. ఇది ఆర్థిక సంస్థలకు, రిటైల్ రంగంలోని ఆహార సంస్థలకు కూడా వర్తిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆర్‌సిఇపి దేశాలు భూమార్కెట్లను తెరవాల్సి వుంటుంది.

పైన పేర్కొన్న రెండు అధ్యాయాలలో రెండు క్లాజులున్నాయి. ఒకటి యధాతధస్థితి, రెండు వెనక్కు మళ్ళే అవకాశం లేకపోవటం అంటే ప్రభుత్వాలు ఏ స్థాయిలో మార్కెట్లను తెరిచివుంచాయో వాటిని అలాగే నిలిపి వుంచాలి, ఒకవేళ దానిని

వారు గనుక పెంచితే ఇక వెనక్కు తీసుకోవటం సాధ్యం కాదు. గత దశాబ్దంలో ఆర్‌సిఇపి దేశాలైన లావోస్, జపాన్‌లలో అనేక చట్టాలలో మార్పులు చేశారు. చిన్న రైతులు సాగుచేసుకుంటున్న భూములు, ఆదివాసీ జాతులు సాంప్రదాయకంగా అనుభవిస్తున్న భూములను పెద్దపెద్ద క్షేత్రాలలో కార్పొరేట్ సాగుచేయటానికి అనువుగా వారి హక్కులను తొలగిస్తూ చట్టబద్ధమైన మార్పులు చేశారు.

ఆర్‌సిఇపి ఒప్పందంపై ఇండియా గనుక సంతకం పెడితే ముందుగానూ, ఎక్కువగానూ ప్రభావితమయ్యేది పాడి పరిశ్రమ. 15 కోట్లమంది చిన్నకారు పాల ఉత్పత్తిదారులతో, స్థానిక సహకార సంఘాలతో, చిన్న అమ్మకందార్ల సముదాయంతో ఇండియా ప్రపంచంలోనే పాల ఉత్పత్తిలో అగ్రగామిగా వుంది. ప్రపంచ పాడిపరిశ్రమపై పెత్తనం చెలాయిస్తున్న అతికొద్ది కంపెనీలు భారతదేశంలో నామమాత్రంగానే వుండిపోయాయి. ఈ రంగంలో దిగుమతులు గానీ, ఎగుమతులుగానీ అతి స్వల్పంగా మాత్రమే జరుగుతున్నాయి. కానీ ఆర్‌సిఇపి లాంటి పలు కొత్త వాణిజ్య ఒప్పందాలుగానీ, యూరపుతో చర్చల్లో వున్న ప్రతిపాదిత ఒప్పందాలుగానీ భారతదేశపు చిన్నకారు పాల ఉత్పత్తిదారులను తుడిచిపెట్టేసే ప్రమాదం వుంది.

వీరిలో ఎక్కువమంది చిన్నకమతాల వాళ్ళే. హెక్టారులోపు భూమి కలిగి వుండి, రెండు లేక మూడు ఆవులతోనో, గేదెలతోనో పాల ఉత్పత్తి సాగిస్తున్నవాళ్ళే. పారిశ్రామిక దేశాలతో పోల్చినప్పుడు ఇండియాలో ఒక పశువు ద్వారా వచ్చే పాల దిగుబడి చాలా తక్కువ. ఇండియాలో ఒక పశువు ద్వారా రోజుకు 3 లీ మాత్రమే దిగుబడివస్తే, పారిశ్రామిక దేశాలలో 30 లీ॥ దిగుబడి వస్తుంది. అయినా, భారతదేశపు పాడి రైతులు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తగినంత నాణ్యమైన పాలను, సరసమైన ధరకు అందించగలుగుతూనే వున్నారు.

భారతదేశంలో 'పాడి' అనేది ఒక పరిశ్రమ కన్నా మించిన స్వభావం కలిగివుంది. చిన్నకారు, సన్నకారు రైతాంగానికి, భూమిలేని వ్యవసాయ కూలీలకు, పశుకాపరులకు, లక్షలాదిమంది పాలసేకరణదారులకు, పాల ఉత్పత్తులను ప్రాసెస్‌చేసే పనిలోను, అమ్మకంలోను నిమగ్నమయ్యే లక్షలాదిమందికి ఇది ప్రధాన జీవనాధారంగా వుంది. ఇందులో ఎక్కువ మంది మహిళలే.

అంతర్జాతీయ పాల వ్యాపారం ఎంతో కాలంగా ద్రవ్యపెట్టుబడి అధీనంలో వుంది. అత్యధిక సబ్సిడీతో, యాంత్రీకరణతో బహుకొద్ది దేశాలలో పాడిపరిశ్రమ అధికోత్పత్తిని సాధించి, దానినంతా అంతర్జాతీయ మార్కెట్లో కుమ్మ రిస్తోంది. ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎగుమతి అవుతోంది.

ఇండియా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ పాడిపరిశ్రమలు దుర్మార్గపు ప్రపంచ మార్కెటు బారినపడి, నాశనం కాకుండా వుండాలంటే అత్యధిక సుంకాలను విధించి మాత్రమే రక్షించుకోగలుగుతాయి. ఈ చర్యలను చేపట్టకపోతే, ప్రపంచ డైరీ దిగ్గజాలు మన చిన్న డైరీలను వేగంగా తుడిచిపెట్టేయటం ఖాయం. భారత ప్రధాని నరేంద్రమోడీ 2013లో గుజరాత్ ముఖ్యమంత్రిగా వున్నప్పుడు పాల ఉత్పత్తుల దిగుమతికి వ్యతిరేకంగా మాట్లాడాడు.

నేటి భారతదేశ పాడిపరిశ్రమ దిగుమతులపై 30 నుండి 60 శాతం వరకు దిగుమతి సుంకం విధించటం ద్వారా రక్షింపబడుతోంది. 2003 నుండి డైరీ దిగుమతులపై ఆరోగ్య సంబంధమైన (సానిటరీ&ఫైటోసానిటరీ)ఆంక్షలను విధించటం ద్వారా అమెరికా వారి పాల ఉత్పత్తులు మన మార్కెట్టును ముంచెత్తకుండా అడ్డుకోగలిగింది. ఇన్ని అడ్డంకులున్నప్పటికీ కూడా డైరీ కంపెనీలు వ్యవస్థలో వున్న లొసుగులను ఉపయోగించుకొని లాక్టోజ్, వే లాంటి డైరీ ఉత్పత్తుల్ని అమెరికా, యూరప్‌ల నుండి తగినంత పరిమాణంలో ఎగుమతి చేయగలుగుతున్నాయి. ఈ దిగుమతుల ప్రభావం భారతదేశపు పాలసహకార సంఘాలపై, చిన్నస్థాయి డైరీ వ్యవస్థలపై గణనీయంగానే వుంది. భారతదేశపు అతిపెద్ద సహకార పాల ఉత్పత్తి సంస్థ 'అమూల్' ప్రకారం "ప్రతినెలా 15 వందల టన్నుల వే పొడి దేశంలోకి దిగుమతి అవుతున్నది. దానివల్ల మేం మా దగ్గర వున్న స్టాకును చవగ్గా అమ్మవలసివస్తోంది. ఎందుకంటే వే పొడి ఇంకా చవగ్గా లభ్యమౌతోంది". 40శాతం దిగుమతి సుంకాలు వున్నప్పటికీ ఇదీ పరిస్థితి.

ఇదేమీ నిరాధార విమర్శకాదు. అనేక బహుళజాతి కంపెనీలు ఆర్‌సిఇపి ఒప్పందం కోసం ఎదురు చూస్తున్నాయి.

## భారత డైరీ మార్కెట్లోకి ప్రవేశిస్తున్న ప్రైవేటు కంపెనీలు

భారతదేశంలోని పాడి పరిశ్రమను కార్పొరేటు సులభతరంగా స్వాధీనం చేసుకోవ టానికి అవకాశాలు సృష్టించడంలో ప్రైవేటు ఈక్విటీ సంస్థలు కీలకపాత్ర వహిస్తున్నాయి. ప్రారంభంలో షేర్ల అమ్మకాల ద్వారా జరిగిన లావాదేవీల్లోని ఒక దానిలో, 2010లో అమెరికాకు చెందిన కార్లైల్ గ్రూపు దక్షిణ భారతదేశంలో కుటుంబ యాజమాన్యంలో నడుస్తున్న 'తిరుమల మిల్క్ ప్రొడక్ట్సు' అనే ప్రైవేటు డైరీ కంపెనీలో 22 మిలియన్ డాలర్ల షేర్లను కొనేసింది. తర్వాతి 3 సంవత్సరాల కాలంలో తిరుమల తన సరఫరా కేంద్రాలను విస్తరించుకుంటూపోయింది. వంద శీతలీకరణ కేంద్రాలను పెంచింది. ప్రాసెసింగ్ కేంద్రాలు 5 నుండి ఏడయ్యాయి. సరఫరాలను ఉత్తర భారతానికి కూడా విస్తరింపజేసింది. అప్పుడు 2014లో కార్లైల్ గ్రూపు తిరుమలలోని తన షేర్లను ఫ్రెంచి డైరీ కంపెనీ 'లాక్టాలిస్'కు అమ్మివేసింది. ప్రపంచంలోనే 3వ అతిపెద్ద డైరీ ప్రాసెసర్ అయిన లాక్టాలిస్‌కు 250 మిలియన్ డాలర్లకు ఆ షేర్లను అమ్మింది. ఇది మొదట్లో కొన్న విలువకు పదిరెట్లకన్నా ఎక్కువే.

గత కొద్ది సంవత్సరాలలో ఫ్రాన్సుకు చెందిన లాక్టాలిస్ కంపెనీ భారతదేశంలోని అతిపెద్ద డైరీ కంపెనీల్లో ఒకటిగా అవతరించింది. 1960ల నుండి ఎంతో చురుగ్గా వున్న నెస్లేకు తర్వాతి స్థానంలో ఈ కంపెనీ నిలబడింది. 2014లో 'తిరుమల'లో షేర్లు, 2016లో ఇండోర్‌కు చెందిన అనిక్ ఇండస్ట్రీస్‌లోని డైరీ విభాగపు షేర్లు కొన్న తర్వాత ఈ ఫ్రెంచ్ కంపెనీ ప్రభాత్ డైరీకి చెందిన డైరీ వ్యాపారాన్ని, దాని అనుబంధ వ్యాపారమైన సన్‌ఫ్రెష్ ఆగ్రో ఇండస్ట్రీస్‌ను 2019లో కొనేసింది. ప్రభాత్ డైరీకి మహారాష్ట్రలో విస్తృతమైన నెట్‌వర్క్ వుంది. 75000 మందికి పైగా రైతులద్వారా ప్రతిరోజూ 2 లక్షల లీటర్ల పాలను సేకరిస్తుంది. ప్రభాత్‌ను కొనేయడంతో ఈ ఫ్రెంచి కంపెనీకి రెండు కొత్త హంగులు అమిరాయి. ఒకటి, దీనితో అది కొన్న కంపెనీల సంఖ్య 13కి చేరుకోగా, దాని మొత్తం సేకరణ రోజుకు 23 లక్షల లీటర్లకు చేరుకుంది. లాక్టాలిస్ ఉత్తర భారతంలో మరో కంపెనీని కొనేయడానికి ప్రణాళికలు వేస్తోంది. దాని లక్ష్యం దేశంలోని అన్ని డైరీలలో 10 శాతం మార్కెట్ వాటాను స్వంతం చేసుకోవటమే.

న్యూజిలాండ్‌కు చెందిన 'ఫాంటెర్రా' ప్రపంచంలోనే అతిపెద్ద డైరీ ఎగుమతిదారు. దాని కన్ను కూడా భారత మార్కెట్‌పై పడింది. ప్రాధాన్యతలతో కూడిన వాణిజ్య ఒప్పందం ద్వారా కానీ, జాయింట్ వెంచర్లద్వారా కానీ భారత్ మార్కెట్లోకి అది ప్రవేశించజూస్తోంది. 2018 ఆగస్టులో 'ఫ్యూచర్ గ్రూప్', 'ఫ్యూచర్ కన్స్యూమర్' కంపెనీలను నడుపుతున్న కిషోర్ బియానీతో కలిసి 'ఫాంటెర్రా ఫ్యూచర్ డైరీ పార్ట్‌నర్స్' అనే 50:50 జాయింట్ వెంచర్‌ను ప్రారంభించింది. ఇండియాలో ఫాంటెర్రా నిలదొక్కుకోవటానికి, విస్తరించాలనే దాని ఎజెండాను నెరవేర్చుకోవటానికి ఇది తోడ్పడు తుంది. ప్రపంచంలోనే అతిపెద్దదైన, వేగంగా విస్తరిస్తున్న మార్కెట్‌లోకి ప్రవేశించటంద్వారా తమ ప్రావీణ్యతను ప్రదర్శించటానికి ఈ వెంచర్ ద్వారా తగిన భూమికను ఏర్పరచుకునే వీలు కలిగిందని ఫాంటెర్రా ప్రధాన అధికారి లుకాస్ పారావిసిని అన్నాడు.

ఫాంటెర్రా లక్ష్యమేమిటనేది స్పష్టం. చైనా లోనూ, దక్షిణ, తూర్పు ఆసియా దేశాల్లో ఫాంటెర్రాకు ఇంగ్రేడియంట్స్ బిజినెస్‌ను పర్యవేక్షించే తే-హన్-చౌ మాటల్లో "పాల ఉత్పత్తుల దిగుమతిదారుగా ఇండియా మారితే మాత్రం అది న్యూజిలాండ్‌కు చాలా పెద్ద అవకాశంగా వుంటుంది". ఇంకా ఆయనిలా అన్నాడు "ప్రస్తుతం ఇండియా సప్లై, డిమాండుల మధ్య సమతూకాన్ని కొనసాగిస్తోంది. డిమాండు పెరుగుతూనే వుంటుంటే, దానికి తగినట్లుగా ఉత్పత్తి పెరగకుంటే తప్పనిసనిగా దిగుమతులు చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. అది ఎప్పుడు అనేదే అంతుపట్టాల్సినదిగా వుంది".

(grain.org సౌజన్యంతో) స్వేచ్ఛానువాదం

ooo